వర్షాలతో బల్దియా అల్టర్

- 24 గంటలు అందుబాటులో డీఆర్ఎఫ్ బృందాలు
- నోడల్ అధికారులుగా డీఈలు

కార్పొరేషన్, జూలై 20: కరీంనగర్‌లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో బల్దియా అల్టర్ అయింది. నగరపాలక సంస్థ పరిధిలో ఎలాంటి పరిస్థితులు వచ్చినా ఎదుర్కొనేందుకు 24 గంటల పాటు డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేసింది. ఆయా బృందాలకు నోడల్ అధికారులుగా డీఈలకు బాధ్యతలు అప్పగిస్తూ నగర కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కొ బృందంలో డీఈతో పాటు ఏఈలు, టౌన్ ప్లానింగ్ విభాగం సిబ్బంది, పారిశుధ్య విభాగం అధికారులు, డీఆర్ఎఫ్ సిబ్బంది ఉంటారు. ముఖ్యంగా ఉదయం 6 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విధులు నిర్వహించే బృందంలో 24 మంది సభ్యులు ఉన్నారు. దీనికి నోడల్ అధికారిగా డీఈ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్‌గా టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీహరి వ్యవహరిస్తారు. వీరితో పాటు ఇద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, నలుగురు వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది ఉంటారు. అలాగే మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల వరకు విధుల్లో ఉండే బృందంలో 22 మంది సభ్యులు ఉన్నారు. దీనికి నోడల్ అధికారిగా డీఈ ఓం ప్రకాశ్, సూపర్‌వైజర్‌గా ఏఈ గఫూర్ కొనసాగుతున్నారు. అలాగే రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు విధుల్లో ఉండే బృందంలో 18 మంది సభ్యులు ఉన్నారు. దీనికి నోడల్ అధికారిగా డీఈ అయూబ్‌ఖాన్, సూపర్‌వైజర్‌గా టీపీఎస్ నవీన్ వ్యవహరించనున్నారు. ఆయా బృందాలు నగరంలో ఎక్కడ వర్షంతో సమస్యలు తలెత్తినా వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపడుతాయి.

గోదాంగడ్డలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న మేయర్ సునీల్‌రావు

నగరంలో ముసురు

కరీంనగరంలో శనివారం ఉదయం నుంచి ముసురు కొనసాగుతూనే ఉంది. శుక్రవారం సాయంత్రం నుంచి మొదలైన వర్షం రాత్రి మోస్తారుగా కురిసింది. శనివారం ఉదయం నుంచి వర్షం పడుతుండడంతో నగరంలోని ప్రధాన రహదారులు కూడా నిర్మానుష్యంగా మారాయి. ఇక మురుగు కాల్వలన్నీ నిండుగా ప్రవహిస్తున్నాయి.

శిథిల భవనాల యజమానులు అప్రమత్తంగా ఉండాలి: మేయర్

వర్షాకాలం దృష్ట్యా నగరంలో శిథిల భవనాల యజమానులు అప్రమత్తంగా ఉండాలని మేయర్ సునీల్‌రావు సూచించారు. నగరంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గోదాంగడ్డలోని అజ్జా అనే వ్యక్తికి చెందిన గూన పెంకుల ఇంటి పైకప్పు కూలిపోగా, సమాచారం తెలుసుకున్న మేయర్ స్థానిక కార్పొరేటర్ షకీరా అంజుమ్ బర్కత్ అలీతో కలిసి ఆ ఇంటిని పరిశీలించారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలని కోరారు. సదరు కుటుంబ సభ్యులకు స్థానికంగా వేరే చోట ఆశ్రయం కల్పించారు. కాగా, ఆ ఇంటి యజమానులకు ఇప్పటికే నోటీసులు అందించామని పేర్కొన్నారు. వర్షకాలం దృష్ట్యా నగరంలో శిథిలావస్థలో ఉన్న 107 నివాస గృహాలను టౌన్ ప్లానింగ్ అధికారుల ద్వారా గుర్తించి వాటి యజమానులకు నోటీసులు జారీ చేశామని మేయర్ తెలిపారు. ఇప్పటికే దాదాపు 20కి పైగా పూర్తి స్థాయిలో శిథిలమైన నివాస గృహాలను టౌన్ ప్లానింగ్ సిబ్బంది తొలగించారని చెప్పారు.

జలాశయాల్లోకి నీరు

శంకరపట్నం, జూలై 20: మూడు రోజులుగా కురుస్తున్న ముసురుతో కేశవపట్నం నుంచి అర్కండ్ల వరకు వాగుపై నిర్మించిన చెక్ డ్యాంలలోకి నీరు చేరుతున్నది. కాగా, సంవత్సరంలో దాదాపు ఎనిమిది నెలల పాటు జలకళ ఉట్టి పడే ముత్తారం రామస ముద్రం చెరువు నిండి మత్తడి పారుతున్నది.

చిన్నారులకు విజ్ఞాన కేంద్రాలు ప్రీప్రైమరీ సెంటర్లు

- అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అనేక సేవలు
- కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, జూలై 20: రెండున్నరేళ్ల నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు ప్రీప్రైమరీ సెంటర్లు విజ్ఞాన కేంద్రాలుగా మారబోతున్నాయని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని కోతిరాంపూర్‌లో గల అన్నమనేని గార్డెన్స్‌లో చిన్నారులకు నిర్వహించిన అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అనేక రకాల సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. రక్తహీనత, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న మహిళలు, చిన్నారులు, బాలింతలు, గర్భిణుల ఆరోగ్య సంరక్షణకోసం, పౌష్టికాహారం అందుతున్నదన్నారు. ప్రధానంగా పిల్లల్లో వయసుకు తగ్గ బరువు, ఎత్తు ఉండేలా అవసరమైన చర్యలు చేపడుతున్నారని వెల్లడించారు. మహిళల సమస్యలు పరిష్కరించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం సభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఇల్లు బాగుంటుందని, ఇందుకు ప్రతి రోజూ పౌష్టికాహారాన్ని స్త్రీలు తీసుకోవాలని సూచించారు. అంతకు ముందు చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉపయోగించే బోధన పరికరాలు, ఆట వస్తువులు, పుస్తకాలు పరిశీలించారు. చిన్నారులు, గర్భిణులకు అందించే పోషకాహార ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అజయ్‌యాదవ్, స్త్రీ,శిశు సంక్షేమశాఖ అధికారులు సరస్వతి, ఉమారాణి, సబిత, అంగన్‌వాడీ టీచర్లు స్వరూప, సిబ్బంది, చిన్నారుల తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

అక్షరాభ్యాసం చేయిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలి

మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని అర్బన్ సీడీపీవో జి.ఉమారాణి సూచించారు. అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా శనివారం నగరంలోని 40, 41వ డివిజన్ల పరిధిలోని వావిలాల పల్లె క్లస్టర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆమె పాల్గొని మాట్లాడారు. చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాలు అమ్మ ఒడి లాంటి వని, పసిప్రాయంలో వారికి ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు ఎప్పటికప్పుడు గుర్తిస్తూ, వారిని హాస్పిటళ్లకు పంపేలా అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు చర్యలు చేపడుతారని పేర్కొన్నారు. సమావేశంలో పాల్గొన్న ఆయా డివిజన్ల కార్పొరేటర్లు కోటగిరి భూమాగౌడ్, బండారి వేణు మాట్లాడుతూ, 30 నుంచి 60 నెలల వరకు చిన్నపిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని కోరారు. అనంతరం అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె.రాజమణి, పీహెచ్‌సీ వైద్యురాలు డా.శోభారాణి, ఏఎన్ఎం రమ, అంగన్‌వాడీ టీచర్లు పి.జయప్రద, డి.సులోచన, ఎ.ఇందిరారాణి, టి.అశ్విని, ఎస్.ప్రభలత, ఆయాలు, తల్లులు, ఆశవర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

కొత్తపల్లి, జూలై 20 : కార్పొరేషన్ పరిధిలోని 19వ డివిజన్ రేకుర్తిలోని బుడిగ జంగాల కాలనీకి చెందిన పర్వతం కిషన్ అనారోగ్యంతో చనిపోవడంతో అతడి కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నది. ఈ క్రమంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సూచన మేరకు మాజీ సర్పంచ్ నందేల్లి ప్రకాశ్, రాచకొండ నరేశ్, శనిగరపు సతీశ్, నతానియల్ శనివారం బాధిత కుటుంబానికి ఆర్థిక సాయంతో పాటు బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు అందజేశారు. అలాగే బాధిత కుటుంబానికి ఇంటి స్థలం ఇప్పించేందుకు కృషిచేస్తానని మాజీ సర్పంచ్ నందేల్లి ప్రకాశ్ పేర్కొన్నారు.

అద్వితలో బోనాల పండుగ

బోనాల పండుగలో పాల్గొన్న విద్యార్థులు

కమాన్‌చౌరస్తా, జూలై 20 : జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్ అద్విత ఇంటర్నేషనల్ పాఠశాలలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని శనివారం బోనాల పండుగను విద్యార్థులు, ఉపాధ్యాయులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు అమ్మవారి, పోతరాజుల వేషధారణలో నృత్యాలు చేస్తూ బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కులు సమర్పించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సొగాని అనుదీప్ మాట్లాడుతూ, మన రాష్ట్ర సంస్కృతీ సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా పాఠశాలలో ఇలాంటి పండుగలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీణాధరి పాఠశాలలో..

చొప్పదండి, జూలై 20: మండల కేంద్రంలోని వీణాధరి ఉన్నత పాఠశాలలో బోనాల పండుగను ఘనంగా జరుపుకొన్నారు. విద్యార్థినులు నెత్తిన బోనాలతో పాఠశాల నుంచి ఊరేగింపుగా స్థానిక గ్రామ దేవత ఆలయానికి చేరుకొని నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా పోతరాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పాఠశాల కరస్పాండెంట్ తిప్పర్తి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్యలో ఘనంగా గ్రీన్ ఇండియా మిషన్

కమాన్‌చౌరస్తా, జూలై 20 : జిల్లా కేంద్రంలోని బోయవాడ శ్రీ చైతన్య పాఠశాలలో అకాడమిక్స్‌లో భాగంగా స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం గ్రీన్ ఇండియా మిషన్, బోనాలు పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కరీంనగర్ మేయర్ వై సునీల్ రావు, కార్పొరేటర్ అనుప్ హాజరై ప్రారంభించారు. ప్రతి పాఠశాలలో మొక్కలు నాటడం, పర్యావరణ గురించి అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాలల ఏజీఎం ఎం రాజు, ప్రిన్సిపాల్ ఎన్ పద్మజ, డీన్ విజయ కృష్ణ, ప్రైమరీ ఇన్‌చార్జి పూర్ణిమ, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జి, ఏవో మనోహర్ రెడ్డి, శ్రీకాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారమిత విద్యార్థులకు స్పార్క్ ఇన్నోవేషన్ అవార్డు

విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్లు

కమాన్‌చౌరస్తా, జూలై 20 : జిల్లా కేంద్రంలోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థులు ఎం చెగువేరా, ఎం రాహుల్ 2023 విద్యాసంవత్సరానికి శాస్త్రీయ ఆవిష్కరణలో భాగంగా, స్పార్క్ ఇన్నోవేషన్ అవార్డు అందుకున్నారని పాఠశాల డైరెక్టర్ హన్మంతరావు పేర్కొన్నారు. డాక్టర్ కేవీఆర్ సైంటిఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో బిర్లా సైన్స్ మ్యూజియంలో 13 జూలై 2024న నిర్వహించిన 24వ వార్షిక సైన్స్ అవార్డుల సందర్భంగా, అవార్డుతో పాటు సర్టిఫికెట్లు, రూ. 10 వేల నగదు బహుమతి కూడా అందజేసినట్లు వివరించారు. పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థులు లలిత్ మోహన్ సాహు మార్గదర్శనంలో నాలుగు సంవత్సరాల నుంచి వరుసగా ఈ స్పార్క్ ఇన్నోవేషన్ అవార్డును అందుకుంటున్నారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఈ ప్రసాద్ రావు, డైరెక్టర్లు ప్రసూన, రష్మిత, అనూకర్ రావు, రాకేశ్, వీయూఎం ప్రసాద్, రమణ, వినోద్ రావు, హన్మంతరావు, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ, కోఆర్డినేటర్లు విద్యార్థులను అభినందించారు.

గురువులను సత్కరించడం హర్షణీయం

షీటీం ఇన్‌చార్జి విజయమణిని సత్కరిస్తున్న నిర్వాహకులు

కమాన్‌చౌరస్తా, జూలై 20: సాహిత్యం, సంగీతానికి కూడా గురువులు ఉంటారని, ప్రత్యేకంగా గురుపూజోత్సవం సందర్భంగా సంగీత గురువులను సత్కరించుకోవడం ఎంతో హర్షణీయమని ప్రముఖ సాహితీవేత్త గండ్ర లక్ష్మణ రావు పేర్కొన్నారు. ఫిలింభవన్‌లో శనివారం ప్రవీణ్ సల్వాజీ మ్యూజికల్ గ్రూప్ సల్వాజీ ఈవెంట్స్ ఆర్గనైజేషన్ నిర్వహించిన గురుపూజోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం వివిధ రంగాల్లో గురువు స్థానంలో ఉన్న వారిని సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మరో అతిథి మానేరు విద్యాసంస్థల అధినేత కడారు అనంతరెడ్డి మాట్లాడుతూ, కళలకు సాహిత్యానికి తమ సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్న సల్వాజీ ప్రవీణ్‌ను అభినందించారు. తెలంగాణ రాష్ట్ర వృత్తి కళాకారుల సమైక్య అధ్యక్షుడు కృపాదానం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ మధుసూదన్ రెడ్డి, ఏ దయాకర్, గోగుల ప్రసాద్, గుండేటి రమేశ్, తిరుపతయ్య, టీ మురళి, మధు, గొల్లపల్లి రవీందర్, నాందేవ్ పాల్గొనగా, ఈవెంట్ మేనేజర్లు మ్యూజికల్ గ్రూప్ అధ్యక్షుడు సల్వాజీ సంధ్య, సల్వాజి ప్రవీణ్ వందన సమర్పణ చేశారు.

సిద్ధార్థ పాఠశాలలో 'పచ్చదనం-పరిశుభ్రత'

చొప్పదండి, జూలై 20: మండల కేంద్రంలోని సిద్ధార్థ పాఠశాలలో శనివారం పచ్చదనం-పరిశుభ్రతపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు పరిసరాలు, పచ్చదనంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు మొక్కలను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు పచ్చదనం పరిశుభ్రతకు సంబంధించి రూపొందించిన ప్రాజెక్టులను తిలకించి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s: Shriram Finance Limited, Huzurabad Branch. I issue the following notice to general public. My client intends to grant to loan to title Pappula Renuká, W/o: Srinivas, Age: 38 years, Occ: House hold, R/o: H.No. 8-74, Ellanthakunta village and mandal of Karimangar dist by keeping the below mentioned property as security by way of Registered Mortgage. As such if anyone have any claims, charges mortgages Sale agreements Court Attachment, court disputes etc., shall be informed to the address mentioned below in writing within 7 days from the date of this notice otherwise, later objections will not bind my client in this regard

SCHEDULE OF THE PROPERTY

In Jammikunta village, the survey number 697, a vacant house plot to an extent of 121.20 Square yards its equivalent to an extent of 101.32 Square meters, within the boundaries.

North: House of Nampelly Sammaiah vide H.No. 2-6-4/8,
South: Plot of Challoju Jaya,
East: Raily track,
West: Municipal Road,
Is situated at Jammikunta village and mandal of Karimnagar dist

Date:18-07-2024

Sd/- **G.LAXMANA MURTHY**
Advocate, Huzurabad
Cell: 9440389866

నమస్తే తెలంగాణ CLASSIFIED

OLD AGE HOME

★ఒమేగా హోంకేర్: వంట, ఇంటిపని, వృద్ధులకు, పేషెంట్లను, చిన్నపిల్లలను 24 గం॥ చూసుకొనుటకు మీ ఇంటివద్దకే Sr. కేర్‌టేకర్స్‌ని పంపబడును, హైదరాబాద్. 8977639664, 8977639665.

NT-325766-All

PASSPORT LOST

★MANDADY MAHIPAL REDDY, S/o. RAMAKRUSHNA REDDY, H.No: 1-2/1, Mustipally, Siricilla mandal, Rajanna Siricilla Dist, my Passport F5699028 Lost Travelling from Siricilla to Mustipally any Find place call me. Cell: 9029004440.

NTK-0000

PLOT FOR SALE

★YTDA Final Approved 92 Acres Mega Venture @ Bhuvanagiri Town Open Plots for Sale. Opp: Viver Hotel & Collectorate Building 100, 60, 40, 30 All CC Roads & Beautiful Parks, Avenue Plantation, Bank Loans AVL. 9949997199 / 9440415567 / 9866863131.

NT-327686

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

నమస్తే తెలంగాణ

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

3+1 ఫ్రీ ఆఫర్

GST 5% వర్తించును

Cell: 91827 77571

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్, జూలై 20 : విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మోసం అంజయ్య డిమాండ్ చేశారు. నగరంలోని పెన్షనర్స్ భవన్‌లో శనివారం పట్టణ శాఖ సర్వ సభ్య సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయనతో పాటు జిల్లా ఉపాధ్యక్షుడు పోరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం నాలుగు విడుతల కరువుభత్యం సత్వరమే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు రాజమణి, ఆర్థిక కార్యదర్శి నరేందర్, కార్యదర్శులు రాంచంద్రారావు, నర్సింహారెడ్డి, గాలి మోహన్, సభ్యులు తిరుపతిరెడ్డి, రాజవెంకటేశ్వర్లు, శంషాద్దీన్, ఆర్.మల్లయ్య, పట్టణంలోని విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ చెస్ దినోత్సవం

అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో చెస్‌లో పోటీపడుతున్న విద్యార్థులు

కొత్తపల్లి, జూలై 20 : అంతర్జాతీయ చెస్ దినోత్సవాన్ని శనివారం నగరంలో ఘనంగా జరుపుకొన్నారు. కార్ఖానాగడ్డలోని ప్రభుత్వ పాఠశాలలో జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కేక్ కట్ చేయించి వారికి చెస్ బోర్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ డెమొక్రాటిక్ చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కోచ్ కంకటి అనూప్ కుమార్, ప్రధానోపాధ్యాయుడు కె.బద్రూనాథ్, ఉపాధ్యాయులు కే జ్యోతిలక్ష్మి, షబానా, చెస్ డెమొక్రాటిక్ జిల్లా జాయింట్ సెక్రటరీ కంకటి సుజన్ కుమార్, తాటిపల్లి సతీశ్ బాబు, రిటైర్డ్ ఆర్మీ రాజ కుమార్, చెస్ అకాడమీ బాధ్యులు తరుణ్, అభిరామ్, నితిన్, విద్యార్థులు పాల్గొన్నారు.

నగరంలోని ఫండస్ హైస్కూల్‌లో విశ్వనాథ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు నిర్వహించారు. వాటిని మేయర్ వై సునీల్‌రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. చెస్‌లో రాణించే క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీదేవీ చంద్రమౌళి, పాఠశాల చైర్మన్ పద్మజా ప్రభాకర్‌రెడ్డి, డైరెక్టర్ సుశాంక్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్ ఇ- టెక్నో స్కూల్‌లో 6, 7వ తరగతి విద్యార్థులకు చెస్ పోటీలను నిర్వహించారు. చెస్ క్రీడ ద్వారా విద్యార్థులకు కలిగే ప్రయోజనాలను అధ్యాపకులు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, పోటీ నిర్వాహకులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడిగా ఎడ్ల రమేశ్

తెలంగాణచౌక్, జూలై 20: హరిత బయో ప్రొడక్ట్స్ కంపెనీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడిగా ఎడ్ల రమేశ్, కార్యదర్శిగా మహేందర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బీరం మల్లేశం శనివారం తెలిపారు. కోశాధికారిగా సంపత్, ఉపాధ్యక్షులుగా మహేందర్, తిరుపతి, సమ్మయ్య, అశోక్, సహాయ కార్యదర్శులుగా మధు, పవన్, రాజు, వెంకటరమణాచారి, శ్రీనివాస్‌తో పాటు కార్యవర్గ సభ్యులుగా హరీశ్, రాజు, భూషణ్, శ్రీనివాస్ ఎన్నికయ్యారని చెప్పారు.

గోరింటాకు సంబురాలు

కమాన్‌చౌరస్తా, జూలై 20 : జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో శనివారం వెలమ సంఘం ఆధ్వర్యంలో గోరింటాకు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలంతా ఒక చోట చేరి చేతులకు గోరింటాకు పెట్టుకున్నారు. కార్యక్రమంలో వై అపర్ణాసునీల్ రావు, సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

నేచర్ స్కూల్ విద్యార్థుల పాలంబాట

కొత్తపల్లి, జూలై 20 : కొత్తపల్లి మున్సిపల్ పరిధిలోని నేచర్ స్కూల్ విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా శనివారం పొలం పనులను పరిశీలించారు. పట్టణంలోని ఉత్తమ రైతు చిట్కూరి శ్రీనివాస్ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. ఆర్గానిక్ పద్ధతిలో వ్యవసాయం చేయడం, దాని వల్ల కలిగే ప్రయోజనాలను ఉత్తమ రైతు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో నేచర్ స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన

మానకొండూర్ రూరల్, జూలై 20: పోచంపల్లి మోడల్ స్కూల్‌లో మెడికవర్ హాస్పిటల్ (కరీంనగర్) డాక్టర్ కిరణ్ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీపీఆర్ ద్వారా కార్డియక్ పల్మినరీ రెసిటేషన్ ఏ విధంగా పెంచవచ్చో ఇంటర్ విద్యార్థులకు ప్రయోగాత్మకంగా వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అర్చనా ప్రియదర్శిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానకొండూర్ సీఐ సదన్ కుమార్

రాంనగర్ జూలై 20: కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో మానకొండూర్ ఇన్‌స్పెకర్‌కు స్థానం చలనం కల్పిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రస్తుతం మానకొండూర్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న రాజ్ కుమార్‌ను ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని పేర్కొనగా ఆయన స్థానంలో సదన్ కుమార్‌కు పోస్టింగ్ ఇచ్చారు.

విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత

- రౌడీ షీటర్ల కదలికలపై నిరంతర నిఘా
- నేర సమీక్షా సమావేశంలో సీపీ

రాంనగర్, జూలై 20 : కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో విజిబుల్ పోలీసులకు అధికారులు, సిబ్బంది ప్రాధాన్యత ఇవ్వాలని సీపీ అభిషేక్ మొహంతి సూచించారు. శనివారం కమిషనరేట్ కేంద్రంలో అన్ని విభాగాల అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, అధికారులందరికీ పలు కీలక సూచనలు చేశారు. అధికారులంతా విజిబుల్ పోలీసింగ్‌కి ప్రాముఖ్యత పెంచాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో గ్రామ సందర్శనలు, నగరంలో వార్డుల సందర్శనలు పెరుగాలన్నారు. డయల్ 100 ద్వారా వచ్చే ప్రతి ఫిర్యాదును వాస్తవంగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ఇందులో వయసు మళ్లిన, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడే వారిని, సంవత్సరాల పాటు సత్ప్రవర్తనతో మెదిలే వారిని గుర్తించి, వారిపై గల షీట్‌లను సమీక్షించి తీసివేయాలని సూచించారు. గంజాయి రవాణా, వాడకాన్ని అరికట్టడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఎన్‌డీపీఎస్ యాక్ట్ ద్వారా కేసులు నమోదు చేయాలన్నారు. సైబర్ నేరాల నియంత్రణకు పోలీస్‌స్టేషన్ల వారీగా సైబర్ వారియర్స్‌ను నియమించామన్నారు. వారు బాధితులకు సహకరించాలని, డయల్ 1930కి, ఎన్.సి.ఆర్.బి పోర్టల్‌కు సమాచారం అందించి అకనాలెడ్జ్‌ని పొందాలని, దాని ఆధారంగా పోగొట్టుకున్న సొత్తును తిరిగి తెప్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. డివిజన్ల వారీగా రోడ్డు ప్రమాదాలపై సమీక్ష చేశారు. ఒకే చోట పలు ప్రమాదాలు జరిగిన చోటును హాట్ స్పాట్‌గా గుర్తించి, వాటికీ గల కారణాలను తెలుసుకుని అవసరమైతే ఇతర శాఖల సమన్వయంతో సమస్య పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలన్నారు. కమిషనరేట్ వ్యాప్తంగా పోలీస్‌స్టేషన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, అందుకు గల కారణాలను తెలుసుకున్నారు. త్వరితగతిన కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (శాంతి భద్రతలు) ఏ లక్ష్మీనారాయణ, ఏసీపీలు శ్రీనివాస్ (సి.ఎస్.బి), నరేందర్, వెంకటరమణ, శ్రీనివాస్ జీ, విజయ్ కుమార్, వేణుగోపాల్, కాశయ్య, నర్సింహారెడ్డి (సైబర్ క్రైమ్ పీఎస్)తో పాట